ప్రతి గడపకు తాగునీరు : ఏపీ స్పీకర్ తమ్మినేని

విశాలాంధ్ర-ఆమదాలవలస : నియోజకవర్గంలో ప్రతి గడపకు త్రాగునీరు అందిస్తామని ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. ఆమదాల వలస మండలం వెదుల్ల వలస గ్రామంలో సుమారు 44.58 లక్షల నిధులతో కట్యచర్యులపేట గ్రామంలో సుమారు 37.07 లక్షల నిధులతో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి మంచినీటి కొళాయి కార్యక్రమానికి గురువారం స్పీకర్ తమ్మినేని సీతారాం చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో మహిళలు పడుతున్న కష్టాలను చూసి చలించి గ్రామాలలో నీటి కొరత లేకుండా ప్రతి గడపకు త్రాగునీరు అందించాలని లక్ష్యంతోనే ఈ కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టారని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్లు సురేష్,ఎన్ని రామచంద్రయ్య స్థానిక నాయకులు బాల రామారావు, వైస్ ఎంపీపీ మానుకొండ వెంకటరమణ, మరియు వైఎస్ఆర్ పార్టీ సర్పంచులు ఎంపీటీసీలు నాయకులు కార్యకర్తలు అధికారులు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ప్రజా వైద్యాన్ని చేరువ చేయడం ప్రభుత్వ బాధ్యత

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: అందరికీ ప్రజా వైద్యాన్ని చేరువ చేయడం, ప్రభుత్వాస్పత్రి లో సౌకర్యాలు మెరుగు పరచడం అన్నవి ప్రభుత్వ బాధ్యతఅని, ఇందుకు అనుగుణంగానే తమ ప్రభుత్వం పనిచేస్తోందని రెవెన్యూ శాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. గార మండలం, తూలుగు పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. అక్కడి సిబ్బందితో మాట్లాడారు. వైద్య సేవలు అందుతున్న తీరు గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి కుటుంబం దగ్గరకు వైద్యులనూ, ఆరోగ్య కార్యకర్తలనూ పంపించడం గొప్ప విషయం అని అన్నారు. ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తమ ప్రభుత్వం విద్య,వైద్య రంగాలకు అధిక కేటాయింపులు చేస్తున్నదని, నిధుల వెచ్చింపుల్లో ఎక్కడా వెనుకంజ అన్నది లేనేలేదని, ఇప్పటికే రిమ్స్ లో అధునాతన పరికరాలు అందుబాటులోకి తీసుకు వచ్చామని, అలానే రాష్ట్ర వ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ గొండు కృష్ణ మూర్తి, ఎంపిపి గొండు రఘురాం, జడ్పీటిసి మార్పు సుజాత, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి, మండల వైఎస్ఆర్సీపీ అధ్యక్షులు పీస గోపి, సర్పంచ్ కొయ్యాన నాగ బూషణం, యల్లా నారాయణ, సుగ్గు మధు రెడ్డి, మార్పు పృథ్వి, అరవల రామ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి 'అరవ్ బిసాయి'కి విద్యార్థుల ఆర్థిక సాయం

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని మాణిక్యపురం గ్రామానికి చెందిన అరవ్ బిసాయి అరుదైన హెచ్ ఎల్ హెచ్ వ్యాధితో బాధపడుతున్న విషయాన్ని విశాలాంధ్ర దినపత్రికలో వెలువడిన కథనం ద్వారా తెలుసుకుని స్పందించిన బొరివంక జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు అరవ్ బిసాయి కు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ మేరకు గురువారం బొరివంక జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు 8 వేల రూపాయలు నగదును సేకరించి ప్రధానోపాధ్యాయుడు సనపల రామకృష్ణ చేతుల మీదుగా అన్నవరం హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు ఆధ్వర్యంలో అరవ్ బిసాయి కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో అన్నవరం హెల్పింగ్ హాండ్స్ సభ్యులు, ఉపాధ్యాయ సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

సెమ్స్ ఒలింపియాడ్‌లో సత్తా చాటిన బోరుభద్ర విద్యార్థులు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : గత ఏడాది నిర్వహించిన జాతీయ స్థాయి ప్రతిభా పరీక్ష సెమ్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ ట్యాలెంట్ టెస్టులో బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటి మంచి ర్యాంకులు సాధించినట్టు ప్రధానోపాధ్యాయులు పాగోటి రామకృష్ణ తెలిపారు. డోకి వేదేశ్ భగవాన్ జోనల్ స్థాయిలో ద్వితీయ ర్యాంక్ సాధించి నగదు పురస్కారం, బంగారు పతకం, ప్రశంసాపత్రం పొందినట్టు ఆయన తెలిపారు. చెక్క సంధ్య, పాలిన ప్రవీణ్ కుమార్, మామిడి హేమ, ఎన్ని తనుశ్రీ, నంకు వర్షిత్ జోనల్ స్థాయిలో మంచి ప్రతిభ చూపి బంగారు పతకాలు, ప్రశంసా పత్రాలు పొందారని ఆయన తెలిపారు. అలాగే గురు బ్రహ్మ అవార్డు ఉపాధ్యాయులు బాడాన రాజుకి ప్రదానంచేసి శాలువా, జ్ఞాపికలతో సన్మానించారని ఆయన తెలిపారు. అవార్డులు పొందిన విద్యార్థులకు ఉపాధ్యాయులు టి.లోకేశ్వర రావు, బాడాన రాజు, ఉమా శంకర్, వెంకటరెడ్డి, కె.త్రినాధరావు, ఉమా దేవి,రమణమ్మ, విజయలక్ష్మి, నాగమణి, తవిటి రెడ్డి, జగదాంబ, రజని, శ్రీనివాసరావు, తిరుపతిరావు, శంకరరావు అభినందించారు.

మేము మెట్టూరు బిట్-3లో ఉంటాం

పెద్దమడి గ్రామస్తులు డియల్‌పివోకు వినతి

విశాలాంధ్ర-కొత్తూరు : మేము గతం మాదిరిగా మెట్టూరు బిట్3 (ఇరపాడు) పంచాయితీలో కొనసాగుతాం ఇది మా అందరి అభిమతం అని ప్రస్తుతం ఏ పంచాయితీకి చెందని పెద్దమడి గ్రామస్తులు టెక్కలి డీయాల్.పివో రమణకు వినతిపత్రం ఇచ్చి తమ అభిప్రాయాన్ని తెలిపారు వంశధార ప్రాజెక్ట్ నిర్వాసితుల కాలనీగా ఉన్న పెద్దమడి గ్రామం సాంకేతిక కారణాలతో ఏటు చెందకుండా ఉంది ఇంతవరకు అన్నిరకాల పౌర సేవలు మెట్టూరు బిట్3 పంచాయితీ నుండి పొందుతున్నారు. ఇటీవల జగనన్నకు చేపుదాం కార్యక్రమం కొత్తూరు ఎంపిడిఓ కార్యాలయంలో జరిగింది అప్పుడు ఈ సమస్యను బిట్3 సర్పంచ్ కోయిలాపు శ్రీనివాస్ రావు ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చారు ఈ నేపథ్యంలో పెద్దమడి గ్రామస్తుల అభిప్రాయాన్ని తెలుసుకోవడానికి టెక్కలి డి. యల్.పివో రమణ గురువారం పెద్ద మడి లో సర్పంచ్ కోయిలాపు అధ్వర్యంలో గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సభ లో గ్రామస్తులు మెట్టూరు బిట్ 3గ్రామ పంచాయితీలో కొనసాగడానికి. తమ సమ్మతిని తెలుపుతూ వినతి పత్రాన్ని డి.యల్.పివోకు అందజేశారు.

జగనన్న ఆరోగ్య సురక్ష - పల్లెలకు శ్రీరామ రక్ష

విశాలాంధ్ర-సరుబుజ్జిలి : సరుబుజ్జిలి మండలంలోని సింధువాడ గ్రామంలో గురువారం మండల ఉప ఎంపీపీ గోవింద వెంకట శివానందమూర్తి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభించారు.

కార్యక్రమంలో శివానందమూర్తి (బాబు) మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పల్లె ప్రజలకు శ్రీరామరక్ష అని అన్నారు. పల్లెల్లో వ్యవసాయ పనుల్లో బిజీగా ఉండే వ్యవసాయ రైతు మరియు రైతు కూలీలు, అనారోగ్యం పాలైనప్పటికీ పట్టణానికి వెళ్లేందుకు సమయం సరిపోక, వ్యవసాయ పనుల్లోనే కాలం గడుపు తున్న వ్యవసాయ కార్మికులకు, తమ వద్దకే వచ్చి జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా వారి ఆరోగ్యాన్ని చక్కదిద్దడం అభినందనీయమని ఇటువంటి కార్యక్రమం జగన్మోహన్ రెడ్డి మాత్రమే చేయగలరని అన్నారు. ఈ కార్యక్రమంలో సాధరణ ఓపిలు, కంటి ఓపిలు, వివద టెస్టులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జి.గోవింద కామేశ్వరి ఆరోగ్య సురక్ష ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సరుబుజ్జిలి పిహెచ్‌సి డాక్టర్ ఎండ భవ్య శ్రీ, స్పెషలిస్ట్ డాక్టర్స్, హెల్త్ సూపర్వైజర్స్, ఎం.ఎల్.హెచ్.పి, ఆశ కార్యకర్తలు, వైసిపి నాయకులు బద్దిన రామారావు, ఎస్ శ్రీనివాసరావు, పి.తవిటినాయుడు, ఆర్. అప్పలనాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫార్మసిస్టు, ఎఫ్ఎన్ఓ పోస్టుల అభ్యర్థుల జాబితా

విశాలాంధ్ర-శ్రీకాకుళం : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వారి కార్యాలయం నుంచి ఇటీవల వెలువడిన ఫార్మసిస్టు, ఎఫ్ఎన్ఓ పోస్టుల నిమిత్తం అభ్యర్థుల జాబితాను (శ్రీకాకుళండాట్‌జీవోవీఇన్) వెబ్సైట్లో పొందుపరిచినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బొడ్డేపల్లి మీనాక్షి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులకు ఏమైనా సందేహాలు ఉంటే ఈనెల 16లోగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి దరఖాస్తులు అందివ్వాలని కోరారు.

పలు కుటుంబాలను పరామర్శించిన దాసునాయుడు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : శ్రీకాకుళం జిల్లా తెలుగుయువత అధ్యక్షులు మెండ దాసునాయుడు బుధవారం సంతబొమ్మాళి మండలంలో పర్యటిస్తూ, పలు కుటుంబాలను పరామర్శించారు. బోరుబద్ర, వడ్డివాడ మాజీ సర్పంచ్ లు చనిపోయిన కారణంగా వారి కుటుంబాలని పరామర్శించారు. వారితోపాటు నర్సాపురం, పాలతలగాం, ఆర్ హెచ్ పురం, ఉమిలాడ పంచాయతీలలో పలువురుని పరామర్శించారు. ఆయనతో పాటు బెండి అరుణ్ కుమార్, కూచెట్టి భానుప్రకాష్,పిట్ట రాజులు, ఎన్ని డిల్లేష్, వారాధి చంటి, కొర్రాయి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 16న విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నాను జయప్రదం చేయండి

వామపక్ష నాయకులు పిలుపు

విశాలాంధ్ర-గార: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన విద్యుత్ చార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని కోరుతూ అక్టోబర్ 16వ తేదీన విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా జయప్రదం చేయాలని వామపక్ష నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక కామ్రేడ్. ఎస్ఆర్ దాసరి క్రాంతి భవనంలో కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమం చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బలగ.శ్రీరామ్మూర్తి, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. గురువారం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి.కృష్ణమూర్తి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడుతూ అధిక ధరలు, అదనపు భారాలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే విద్యుత్ భారాలు వేయడం తగదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాలుగు సంవత్సరాల నుండి విద్యుత్ ఛార్జీల పెంపు, స్లాబులు మార్చి భారాలు మోపడం, ట్రూ అప్ చార్జీలు, ఇంధన సర్ చార్జీలు, కస్టమర్ చార్జీలు, ఫిక్సిడ్ చార్జీలు, విద్యుత్ సుంకం పెంచడం, సర్దుబాటు ఛార్జీల పేర్లతో రెట్టింపు భారాన్ని ప్రజలపై వేశారని అన్నారు. బిల్లులు చెల్లించలేక ప్రజలు గగ్గోలు పెడుతున్నా రని, వ్యాపారాలు దెబ్బతింటున్నాయని, పరిశ్రమలు మూతపడుతున్నాయని, ఉపాధి దెబ్బతింటోందని తెలిపారు. ప్రతినెలా జమా ఖర్చులపై విచారణ లేకుండానే యూనిట్‌కు అదనంగా రూ.0.40 పైసలు చొప్పున సర్దుబాటు చార్జీలు వసూలు చేయడం దారుణమని పేర్కొన్నారు. వడ్డీ పేరుతో మరో రూ.1500 కోట్లు రాష్ట్ర ప్రజలపై విద్యుత్ భారాలు మోపేందుకు విద్యుత్ శాఖ ప్రతిపాదన ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే విధిస్తున్న సర్దుబాటు చార్జీల భారాలను రద్దు చేయాలని కోరారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ లకు లక్షల కోట్ల రూపాయలు పన్ను రాయితీలు ఇస్తూ సామాన్యులపై భారాలు వేస్తుందని విమర్శించారు. మోడి ప్రభుత్వానికి అదానీ, అంబానీ ప్రయోజనాలు తప్ప సామాన్యుల ప్రయోజనాలు పట్టడం లేదని విమర్శించారు. రాష్ట్రాల హక్కులను హరిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రజలపై భారాలు వేసి ఆదాయాలు రాబట్టాలని ఆదేశాలు జారీచేస్తున్నదని అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను అమలు చేయకపోతే అప్పుకి అనుమతి ఇచ్చేదిలేదని బెదిరిస్తున్నదని, ఈ విధానాలను జగన్ ప్రభుత్వం వ్యతిరేకించకుండా మోడీకి భజన చేస్తూ ఆ విధానాలనే అమలు చేస్తూ ప్రజలపై పన్నుల భారాన్ని మోపుతున్నారని విమర్శించారు. మోడి ఆదేశిస్తే జగన్ పాటిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి డోల శంకర్రావు, ఏఐటీయుసీ జిల్లా గౌరవ సలహాదారు చిక్కాల గోవిందరావు, ప్రజానాట్య మండలి జిల్లా నాయకులు శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకులు గుడ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో లైన్స్ క్లబ్ చిత్రాలేఖనం పోటీలు

విశాలాంధ్ర-నరసన్నపేట : నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం నరసన్నపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి కానిసిస్తూ డ్రీం అండ్ డేర్ అనే అంశం పై విద్యార్థులకు చిత్రాలేఖనం పోటీలు నిర్వహించడం జరిగింది. ఉత్తమ చిత్రాలేఖనాలకు మొదటి, ద్వితీయ, తృతీయ, బహుమతులుంటాయాని, ప్రకటించారు.. విజేతల వివరాలను లయన్స్ రీజియన్ స్థాయికి పంపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమం లో లయన్స్ క్లబ్ అధ్యక్షులు సదాశివుని క్రిష్ణ, సెక్రెటరీ వి. నాగరాజు, కోశాధికారి, పొట్నూరు రమేష్, ప్రతినిధులు, సాయి శ్రీనివాస్ శర్మ, కే. సాయిరాం, జోన్ చైర్మన్ ఊన్న రంగనాథ్, పాఠశాల హెచ్ ఎం వి. వెంకట్రావు లు పాల్గొన్నారు. ఈ పోటీల్లో 40 మంది విద్యార్థిని, విద్యార్థులు, పాల్గొన్నారు.

సాకారమైన పేదల సొంతింటి కల

- ఇండ్ల నిర్మాణంలో జిల్లాకు 3వ స్థానం
- జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్
- ఇళ్ళు కావు ఊళ్లు : శాసన సభ్యులు ధర్మాన కృష్ణదాస్

విశాలాంధ్ర-జలుమూరు: ఎన్నో యేళ్ళుగా ఎదురుచూస్తున్న పేద ప్రజల సొంతింటి కల సాకారం అయిందని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. సరైన గృహ వసతి లేక ఇబ్బంది పడుతున్న పేద ప్రజలు గౌరవప్రదంగా జీవించే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి కాకినాడ జిల్లా సామర్లకోటలో పేద అక్క చెల్లెమ్మలకు లాంఛనంగా ఇళ్లను అందజేయగా, శ్రీకాకుళం జిల్లా స్థాయిలో ఈ కార్యక్రమం నరసన్నపేట నియోజకవర్గం జలుమూరు మండలం లింగాల వలస పంచాయితీ చల్లపేట కాలనీలో జరిగింది. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో కాకినాడ జిల్లా సామర్లకోటలో నుంచి వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి మంత్రి సందేశాన్ని అందరూ వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అరులైన వారందరికీ ఇళ్ల స్థలాల నిమిత్తం 179690 ఎకరాలు అవసరం కాగా 1227,17 ఏకరాల ప్రభుత్వ భూమిని సేకరించి, మిగతా 508.63 ఎకరాల మేరకు ప్రైవేటు భూమి కొనుగోలు చేశామన్నారు. ఒక్క భూమి కోనుగోలు కోసమే రూ.178.31కోట్లు వెచ్చించి అర్హులైన జిల్లాలో 1.20 లక్షల మందికి పట్టాలు ఇచ్చామన్నారు. జిల్లాలో సుమారు 700 లేఔట్ లలో తాగునీటి సౌకర్య, రోడ్లు, విద్యుత్, డ్రైనేజ్ లాంటి పనులు చురుగ్గా చేస్తున్నామన్నారు. ఇండ్ల నిర్మాణంలో శ్రీకాకుళం జిల్లా 32,690 ఇండ్లతో రాష్ట్రంలోనే మూడవ స్థానంలో నిలిచిందన్నారు. ఇందుకు కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే గృహ ప్రవేశాల జరుగుతున్న ఇళ్లలో శుభాలు జరగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. మాజీ ఉప ముఖ్యమంత్రి, నరసన్నపేట శాసన సభ్యులు ధర్మాన కృష్ణ దాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇళ్లు లేని పేదలెవరూ ఉండకూడదన్న లక్ష్యంతో.. అక్కచెల్లెమ్మల సొంతింటి కలను నిజం చేస్తూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా పేద అక్కచెల్లెమ్మలకు ఇప్పటికే ఏకంగా 30.75 లక్షల ఉచిత ఇళ్ల పట్టాల పంపిణీ, నవరత్నాలు పేదలందరికీ ఇళు క్రింద శరవేగంగా 21.76 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ఆ నాటి రెవెన్యూ మంత్రిగా తన చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేసే అవకాశం సీఎం తనకిచ్చారని అది తన పూర్వ జన్మ సుకృతం అన్నారు. ప్రభుత్వం నిర్మిస్తున్నవి ఇళ్ళు కాదు ఊళ్లని కృష్ణదాస్ పేర్కొన్నారు. హ్యాపీ సందర్భంగా గ్రామంలోని నూతనంగా నిర్మించిన పలు గృహాలకు కలెక్టర్‌తో కలిసి గృహప్రవేశాలు నిర్వహించారు. కాలనీ నిర్మాణానికి సంబంధించిన పైలాన్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, హౌసింగ్ పీడీ ఎం.గణపతి రావు, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ధర్మాన రామ్ మనోహర్ నాయుడు, ఎంపీపీ వాన గోపి, సారవకోట జెడ్పీటీసీ వరదు నాగేశ్వరి, డోల జగన్, చింతు రామారావు, బగ్గు రామకృష్ణ, రాజాపు అప్పన్న, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శర్వాణి విద్యార్థులు 'బెహరా మనో వికాస కేంద్రం' సందర్శన

విశాలాంధ్ర-అరసవల్లి: స్థానిక అరసవల్లి రోడ్డులో ఉన్న 'శర్వాణి విద్యాలయ' 5వ తరగతి విద్యార్థులు సామాజిక సేవా దృక్పథంతో హెడ్‌మిస్ట్రెస్ కె. రేఖ ఆధ్వర్యంలో బెహరా మనో వికాస కేంద్రంను సందర్శించి ఆ కేంద్రానికి గ్యాస్టౌవ్ మరియు వంటపాత్రలు వితరణ చేశారు. ఈ సందర్భంగా డా. కె. రేఖ మాట్లాడుతూ శర్వాణి అధినేత అంధవరపు సూరిబాబు ఆశయం ప్రతి విద్యార్థికి విద్యతోపాటు సామాజిక, సేవా దృక్పథం కలిగివుండాలనే ఉద్దేశ్యంతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. విద్యార్థులు మనో వికాస కేంద్రాన్ని సందర్శించి అక్కడున్న పలు విషయాలు అవగాహన చేసుకున్నారు. విద్యార్థులతోపాటు ఉపాధ్యాయ బృందం ఎ. దీర్ఘమణి మరియు కె. త్రినాధ్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన్నంగా పారిశుధ్యం

విశాలాంధ్ర-వలాన: మండలంలో బంటుకొత్తూరు పంచాయతీలో పారిశుద్ధ్యం అధ్వాన్నంగా ఉందని పంచాయతీ పాలకులు, అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారని జనసేన నియోజకవర్గ నాయకులు డాక్టర్ వి.దుర్గారావు ఆరోపించారు. బంటుకొత్తూరు పంచాయితీలో జనసేన నాయకులు పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధిరోడ్లపై మురికినీరు ప్రవహిస్తున్నా పంచాయతీ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మురికి నీరుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వీటితో ప్రజలు రోగాల బారిన పడే అవకాశముందని తక్షణమే పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోరారు. ఆయనతో పాటు హరీష్‌కుమార్, దిలీప్‌కుమార్‌లు ఉన్నారు.

మూలపేట సమస్యాత్మక ప్రాంతాన్ని సబ్ కలెక్టర్ పరిశీలన

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు ను టెక్కలి సబ్ కలెక్టర్ నురూర్ కుమార్ గురువారం పరిశీలించారు. మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టుకు వినియోగిస్తున్న రాజపురం రోడ్డు బ్రిడ్జి వద్ద గల కంకర మట్టి నిల్వతో, వేలాది ఎకరాలు వరిపంట ముంపునకు గురై తీవ్ర నష్టాన్ని చవి చూడాల్సి వస్తుందని మూలపేట గ్రామస్తులు బుధవారం జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ స్పందించారు. ఆయన ఆదేశాలకు అనుగుణంగా ఫారెస్ట్ భూములు, బ్రిడ్జి నిర్మాణం జరుగుతున్న ప్రాంతాల్లో పరిశీలించారు. అక్కడ జరుగుతున్న నిర్మాణం వలన 6 వేల ఎకరాల పంట ముప్పు బారిన పడుతుందని, దీంతో మత్స్యకార గ్రామాలకు ముప్పు తప్పదని అధికారులకు జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు కోత మధుసూదన్ రావు వినతి పత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన సబ్ కలెక్టర్ వెంటనే విశ్వసముద్రం అధికారులతో చర్చించి, రెండో కంకరు మట్టి ప్రారంభించే ముందు, మొదటి కంకరు మట్టిని తొలగించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆయనతో పాటు తహసిల్దార్ చలమయ్య, విశ్వ సముద్రం పోర్ట్ ట్రస్ట్ అధికారులు ఉన్నారు.

108 వాహనంలో మగ బిడ్డ జననం

విశాలాంధ్ర-పలాస: మందస మండలం తంగరపుట్టి గ్రామానికి చెందిన సవర శ్యామలకు బుధవారం అర్ధరాత్రి సమయంలో పురిటినొప్పులతో బాధపడుతున్న సమాచారాన్ని 108కు

అందించారు. వెంటనే 108 వాహనంలో ఆమెను పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో వైద్యులు టెక్కలి ఆసుపత్రికి రిఫర్ చేశారు. దీంతో అదే 108 వాహనంలో టెక్కలి తరలిస్తుండగా పలాస జాతీయ రహదారి సమీపంలో పురిటినొప్పులు ఎక్కువ రావడంతో ఈఆర్ సిపి వైద్యులు శ్రీకాంత్ చాకచక్యంగా ప్రసవం చేయించడంతో మగ బిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లి బిడ్డలను టెక్కలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని 108 సిబ్బంది తెలిపారు.

ఎ.ఐ.ఆర్‌లో అలరించిన ఖాదీ రూపకం

విశాలాంధ్ర-పొందూరు: జాతీయోద్యమం అనగానే గాంధీ స్వదేశీ. స్వదేశీ అనగానే ఖాదీ పరిశ్రమ. ఖాదీ పేరు చెప్పగానే పొందూరు గ్రామం గుర్తుకు రాక మానదు. పొందూరు ఖాదీ వైభవం వర్తమాన స్థితి గతులపై ఆకాశవాణి (ఎ.ఐ.ఆర్) విశాఖపట్నం కేంద్రం శుక్రవారం ఉదయం 7.15 గంటలకు "చరఖా శంఖారావం" పేరుతో ఒక గల్పికను ప్రసారం చేసింది ఈ గల్పికను విశాఖకు చెందిన ప్రముఖ సాహితీ వేత్త డా.డి.వి. సూర్యారావు దీన్ని రచించారు. ఆయనకు పొందూరు గ్రామంతో సుదీర్ఘమైన అనుబంధం ఉంది. కాగా వరిష్ఠ పాత్రికేయుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు వాండ్రంగి కొండలరావు సమాచార సౌజన్యంతో 6 పాత్రలతో ఈ లఘు రూపకాన్ని వీనుల విందుగా రూపొందించారు. ఇటీవల కాలంలో ఆకాశవాణి ప్రసారం చేసిన అత్యుత్తమ కార్యక్రమాల్లో ఇదొకటిగా పేర్కొనవచ్చు. పొందూరు ఖాదీ పరిశ్రమ పుట్టుపూర్వోత్తరాలు, గత వైభవం జాతిపిత మహాత్మాగాంధీ దృష్టిని ఆకర్షించడం, రాట్నంపై మేలిరకం సన్ననూలు తయారీ ప్రక్రియ, వస్త్రం రూపకల్పనలోని వివిధ సాంకేతిక అంశాలు, కార్మికుల జీవనసరళి, వాణిజ్య స్థితిగతులను, అన్నింటికీ మించి ఖాదీ అందచందాలు వెనుక చేపముల్లు కీలకమైందని ఈ రూపకంలో చక్కగా ఫోకస్ చేశారు.ఈ వివరాలను ఆయా పాత్రల సంభాషణల ద్వారా చక్కని రచనాశిల్పంతో డా.సూర్యారావు ఆవిష్కరించారు. అవధాన సరస్వతీ, ద్విసహస్రావధాని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికార భాషా సంఘం పూర్వ అధ్యక్షులు డా.మాడుగుల నాగఫణిశర్మ "హంసల ప్రతిబింబం పొందూరు ఖాదీ"శీర్షికతో రాసిన "పొందూరు ఖద్దరనగా.. అందమ్మును చిందు అంచు.. అంచలవలె- రూపొందిన సరస్వతీ శ్రుతి... సుందరి వాహనము ఘనము... శుభమౌ మీకున్!" అలాగే తాపీ ధర్మారావు రాసిన" పాడవే రాట్నమా ప్రణవ భారతగీతి" అనే పాటను ఈ లఘు రూపకంలో వినగలం.ఇందులో మూడు విద్యార్థి పాత్రలలో బాలలు పోషించారు. స్వరాజ్యమూర్తి పాత్రను ఎ.ఐ.ఆర్ సహాయ సంచాలకులు బేతా రామసూర్యప్రకాశరావు, ఖాదీ కళాకారుడు మల్లేశం పాత్రను డ్యూటీ ఆఫీసర్ సాంబశివరావు పోషించారు.ప్రధాన పాత్ర కొండలరావు మాస్టారి పాత్రను ప్రముఖ రంగస్థల నటుడు బగాది విజయసాయి నటించారు.ఈ పాత్ర ద్వారా చాలా ఉపయుక్త సమాచారం శ్రోతలకు అందుతుంది. ఈ కార్యక్రమానికి డ్యూటీ ఆఫీసర్ తేతలి దిలీప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యం వహించారు.

విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు తల్లిదండ్రుల పాత్ర కీలకం

స్కూల్ కరస్పాండెంట్ రాజేష్

విశాలాంధ-కవిటి: విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు తల్లిదండ్రుల పాత్ర కీలకమని శ్రీ కళ్యాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ లోళ్ళ రాజేష్ అన్నారు. ఈ మేరకు గురువారం కవిటి మండల కేంద్రంలోని శ్రీ కళ్యాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రాంగణంలో ప్రిన్సిపాల్ బిందుమాధవి అధ్యక్షతన సరస్వతీ పూజ,మాతృ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా లోళ్ల రాజేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులను ఉద్దేశించి రాజేష్ ప్రసంగించారు. విద్యార్థులు ఉన్నత భవిష్యత్తుకు తల్లిదండ్రుల పాత్ర కీలకమన్నారు. అనంతరం ముఖ్య వక్త పొందల జానకి రామ్ మాస్టారు మాట్లాడుతు విద్యార్థులకు తల్లి ఆధిగురువని అన్నారు. పిల్లల అభివృద్ధి లో తల్లి పాత్ర కీలకమని అన్నారు. మారుతున్న సమాజానికి దృష్టిలో పెట్టుకుని విద్యార్థులను తల్లిదండ్రులు తీర్చిదిద్దాలని అన్నారు.విద్యార్థులు సర్వతో ముఖాభివృద్ధికి తల్లితండ్రులు పాత్ర చాలా కీలకం అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రిటైర్డ్ డిప్యూటీ డీఈవో గొండ్యాల జానకి రామయ్య మాట్లాడుతూ కవిటి ప్రాంతంలో విలువలతో కూడిన విద్యను అందిస్తున్న ఏకైక పాఠశాల శ్రీ కళ్యాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్ అని అన్నారు. అందుకు నిదర్శనం శ్రీ కళ్యాణి స్కూల్లో విద్యార్థుల పాడిన భగవద్గీత, నీతి పద్యాలు, యూకేజీ విద్యార్థులు చెప్పిన దేశ,రాష్ట్ర రాజధానులు,ఇంగ్లీషులో చేసిన కాన్వర్జేషన్ చూస్తే పాఠశాల గొప్పతనం తెలుస్తుందని అన్నారు.పాఠశాలలోనే విద్యార్థుల క్రమశిక్షణ, నడవడిక ప్రతిరోజు గమనిస్తూ ఉంటానని అన్నారు.అనంతరం ముఖ్య వక్తలు రిటైర్డ్ డిప్యూటీ డీఈవో గొండ్యాల జానకి రామయ్య, పొందల జానకి రామ్ మాస్టారులను కరస్పాండెంట్ రాజేష్, పాఠశాల సిబ్బంది, పాఠశాల విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎకడమిక్ అబ్జర్వర్ రాణి, సీఆర్పీలు తులసి, తనుజ, వైస్ ప్రిన్సిపల్ గీత,ఉపాధ్యాయ సిబ్బంది, తల్లితండ్రులు పాల్గొన్నారు.

ఆదినారాయణ కుటుంబ సభ్యులకు పిన్నింటి పరామర్శ

విశాలాంధ్ర-రణస్థలం : ఎచ్చెర్ల నియోజకవర్గ రణస్థలం పంచాయతీలో ఇటీవల స్వర్గస్తు లైన దీపిల్లి ఆదినారాయణ కుటుంబ సభ్యులకు, రాష్ట్ర సర్పంచుల సంగం ఆర్గనైజర్ సెక్రెటరీ మరియు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఛాంబర్ అధ్యక్షులు మరియు రణస్థలం సర్పంచ్ పిన్నింటి వెంకట భానోజీనాయుడు పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారికి ఆర్థి సాయంగా 50 కేజీల రైస్ అందించారు. సానుభూతి తెలిపినవారిలో ఎంపిటిసి ప్రతినిధి మజ్జి వెంకటరమణ, వార్డు మెంబర్ అప్పారావు, సీతారాం, సువ్వాడ కృష్ణ, కుప్పిలి గోవిందు, అప్పారావు, సంతు, సురేష్, భద్రమ్మ, కుటుంబ సభ్యులు పెద్దలు యువత మహిళలు పాల్గొన్నారు.

29 రోజులకు నీలమణి దుర్గా అమ్మవారి హుండీ ఆదాయం రూ. 3,24,126

విశాలాంధ్ర-పాతపట్నం: శ్రీ నీలమణి దుర్గా అమ్మవారి ఆలయం ధర్మ హుండీ గురువారం లెక్కింపు జరిగింది. 29 రోజుల గాను 3,24,126లు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ టి.వాసుదేవరావు తెలిపారు. నీలమణి దుర్గా అమ్మవారి ఆలయం చైర్మన్ నూలు ఈశ్వరరావు, కమిటీ సభ్యులు పద్ద నేతాజీ, సవిరిగాన కృష్ణారావు, కె చిన్నారావు ల సమక్షంలో ఈ హుండీ లెక్కింపు జరిగింది. ఈ కార్యక్రమానికి దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయం నుంచి జివిబిఎస్ రవికుమార్ పర్యవేక్షణ లో అర్చకులు గానుగుల సంతోష్ కుమార్, ఎ శివప్రసాద్, టి రాజేష్‌లు పాల్గొని సహకరించారు.

బాబుతో మేము సైతం

మెట్టూరులో ఇంటింటికీ దేశం నిరశన కార్యక్రమం

విశాలాంధ్ర-కొత్తూరు : తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్ అనంతర పరిస్థితులను ప్రజలకు వివరించేందుకు చేపట్టిన బాబు తో మేము సైతం కార్యక్రమాన్ని గురువారం మండలం మెట్టూరు కేంద్రంలో పాతపట్నం టీడీపీ ఇంఛార్జి, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ అధ్వర్యంలో జరిగింది ఈ సందర్భంగా తనవెంట స్థానిక ఆ పార్టీ నాయకులు రాగా మాజీ ఎమ్మెల్యే కలమట ఇంటింటికీ. వెళ్లి చంద్రబాబునాయుడు అక్రమ అరెస్ట్‌పై వాస్తవాలను వివరించారు ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-పలాస : ఇచ్ఛాపురం మండలం ముచిందార పంచాయతీ బెన్నిగానిపేట గ్రామంలో నివసిస్తున్న నిరుపేద అర్చున్ సాహు తన ఇళ్ల నిర్మాణం కోసం పవన్‌పుత్ర సేవా సంస్థ సభ్యులు 5వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో తిప్పన దుర్యోధనరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే వైద్య సేవలు

విశాలాంధ్ర-పలాస : ప్రజల ఇంటి వద్దకే వైద్య సేవలు అందించేందుకే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పలాస పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి అన్నారు. గురువారం మండలం తర్లాకోట గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 256 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించగా ఎముకల వ్యాధికి సంబంధించి 28, కళ్ళకు సంబంధించి 42 మంది రోగులకు వైద్య పరీక్షలు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎన్ రమేష్ నాయుడు, వైద్యాధికారి సునీల్ కుమార్, డాక్టర్ చిన్నంనాయుడు, డాక్టర్ అంజలి, సర్పంచ్ కొర్ల సంతోష్ కుమార్, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ మాధవరావు, సచివాలయం మండల కన్వీనర్ దువ్వాడ రవి కుమార్, బమ్మిడి దుర్యోధన, సవర లక్ష్మణ. గొండి మోహనరావు. షవర రమేష్. షణ్ముఖరావు. సూర్యం. సవర కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సీతయ్య ఫౌండేషన్ అనాధలకు బోజన వితరణ

విశాలాంధ్ర-సోంపేట : సోంపేటకు చెందిన ప్రముఖులు, టీడీపీ నాయకులు పొందూరు రాజు గురువారం సమీపంలో గల సీతయ్య పౌండేషన్‌లో అనాధలు, వృద్ధులకు, అభాగ్యులకు భోజన వితరణ చేపట్టారు. తన కుమార్తె లక్ష్మి జన్మదినం సందర్భంగా అనాధల మధ్య పుట్టినరోజు వేడుకలు జరిపి తన సతీమణి భాగ్యలక్ష్మితో కలిసి సంతృప్తికరంగా భోజనాలు ఏర్పాటు చేశారు. దీని పట్ల ఫౌండేషన్ నిర్వాహకులు గుల్ల రమేష్, మోహనరావు కృతజ్ఞతలు తెలిపారు.

రోగులకు అండగా జగనన్న ఆరోగ్య సురక్ష

విశాలాంధ్ర-పలాస: రోగులకు అండగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధి హాట్కో కాలనీలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రోగులకు వైద్య సేవలతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్, కౌన్సిలర్లు సనపల సింహాచలం, కోఆప్షన్ సభ్యులు రోణంకి శ్రీనివాస రావు, వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి ఒక్కరికి వైద్యం : ఎంపీపీ

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా సచివాలయం స్థాయిలో ప్రతి పేదవాడికి వైద్యం అందులుందని స్థానిక మండల పరిషత్ అధ్యక్షుడు రోణంకి ఉమామల్లేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోగల తర్లిపేటగ్రామ సచివాలయ పరిధి ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మారుతున్న ఆహారపు అలవాట్లు, జీవన విధానం వల్ల ప్రజల్లో పలు రకాల రుగ్మతలు తలెత్తుఉన్నాయన్నారు. అందుకు తగినట్లుగానే వైద్యం పేదలకు అందని ద్రాక్షలా మారిందని దీనిని దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి ప్రజలవద్దకే వైద్యం తీసుకు వచ్చారని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ప్రాథమిక వైద్య కేంద్రం వైద్యారాలు డాక్టర్లు డి. నీరజ, మనీష, ప్రీతి, జోత్న, సురేష్, నితీష్‌కుమార్‌లు 300 మంది పలు రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు

సంపతిరావు రాఘవరావు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్య క్రమంలో ఎంపీడీవో కె. ఫణీంద్రకుమార్, డిప్యూటీ తహసీల్దార్ ఆర్. మధు, ఈవోపీఆర్‌డీ బొడ్డేపల్లి రామారావు, రాష్ట్ర కళింగ కర్పోరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, నాయకుడు పేడాడ వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి పంచాయతీని కేంద్ర బృందం సందర్శన

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : సంతబొమ్మాళి గ్రామ పంచాయతీని బుధవారం కేంద్ర బృందం సభ్యులు సందర్శించారు. మినిస్ట్రీ ఆఫ్ పంచాయితీ రాజ్ (జీఓఐ) అనుబంధ సంస్థ అయిన కేరళ ఇన్స్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్ (కిలా) పరిశీలకులు నంబూద్రి, వారి బృందంతో పాటు, జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి వెంకట్రామన్, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ రాజు, డివిజనల్ స్థాయి పంచాయతీ అధికారి ఐ.వి.రమణలు పర్యటించారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ కళింగపట్నం లక్ష్మి అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో, ముందుగా గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివ్వాలులర్పించారు. అనంతరం సమావేశం నిర్వహించి గ్రామ పంచాయితీ యొక్క మౌలిక సదుపాయాలు, పరిపాలన, వసతులు, గ్రామ పంచాయతీ ఆర్థిక సమికరణ ప్రత్యక్షంగా చూసారు , అలాగే గ్రామ సచివాలయంలో సచివాలయం సిబ్బంది విధులు, బాధ్యతలు, ప్రజలకు అందిస్తున్న సేవలు, గ్రామ వాలంటీర్స్ విధులు, బాధ్యతలు ప్రజలుకు అందిస్తున్న సేవలు, సర్పంచ్, వార్డ్ మెంబెర్స్‌తో పలు విధివిధానాలు గ్రామ పంచాయితీ అవలంబిస్తున్న పలు అంశాలు గూర్చి అడిగి తెలుసుకున్నారు. తదుపరి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్దకు పర్యటించి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంపద తయారీ కేంద్రం వద్ద నిర్వహిస్తున్న వ్యర్థాల నిర్వహణ తడి చెత్త, పొడి చెత్తసేకరణ , వాటిని నాడెప్ పిట్లలో వేసి వర్మి కంపోస్టు తయారు చేయు విధము, సెగ్రిగేషన్ చేసే పద్ధతి, వాటి నుంచి వస్తున్న ఆదాయ మార్గాలు, గ్రామపంచాయతీకు వస్తున్న వివిధ ఆర్థిక మార్గాలతో పాటు, మండలము లో గల చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంల పనితీరు తదితర అంశాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై సానుకులంగా స్పందించి 'ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్ సర్టిఫికేషన్ గుర్తింపునకు' సిఫార్సుచేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్సి రిసోర్స్ పర్సన్‌ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి రాధా రాణి, జి విజయ్ కుమార్ వర్మ, కళింగపట్నం నాగరాజు, వార్డ్ మెంబర్స్, సచివాలయం సిబ్బంది, వాలంటీర్స్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

జగనన్నకు చెబుతాం కార్యక్రమానికి 62 వినతులు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : సంతబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం జరిగిన జగనన్నకు చెబుతాం కార్యక్రమానికి మండలంలో వివిధ సమస్యలు పై 62వినతులు వచ్చాయి. ఈ సందర్భంగా పలువురు అర్జీదారులు తమ సమస్యలు సంతబొమ్మాళి తహశీల్దార్ కార్యాలయంకి వచ్చిన కలెక్టర్ శ్రీకేష్ బి లాటకర్ దృష్టికి తెచ్చి వినతులు సమర్పించారు. వంశధార కాలువలు పనులు చేసి ఏళ్లు గడుస్తున్నా బిల్లులు అవలేదని సంతబొమ్మాళి మండలం పీఏసీఎస్ అధ్యక్షుడు కెల్లి జగన్నాయుకులు (గోవిందరావు) ఆధ్వర్యంలో ఎంపిపి మెరుగు అప్పారావు, పాలతగాం, ఎస్ బి కొత్తూరు, మలగాం సర్పంచ్ లు నక్కిట్ల అప్పన్న నరేష్, లోకనాదము, సూరాడ వెంకటేష్, ఎంపీటీసీ సూరాడ రాజారావు లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అంతకుముందు వీరితోపాటు జెడ్పీటీసీ పాల వసంతరెడ్డిలు కలెక్టర్‌కు సన్మానించారు. ముఖ్యంగా తంపరకు అనుకోని ఉన్న రైతులు, వడ్డితాంధ్ర స్వదేశీ మత్యకారులు మూలపేట రహదారి లో రాజపురం బిడ్జి ల వద్ద వరద నీటి ప్రవాహానికి అడ్డంగా గ్రావెల్ రోడ్డు వేయడం వల్ల వరద నీరు సముద్రంలోకి వెళ్లకుండా పంట పొలాలు మునిగి పోతున్నాయని, అలాగే గుర్రపు డెక్క పేరుకు పోవడం వల్ల ఉపాధి కోల్పోతున్నామని కలెక్టర్ దృష్టిలో పెట్టారు. అలాగే మేఘవరం వంశధార కాలువ లో పూడిక, పిచ్చి మొక్కలు పేరుకుపోయి శివారు భూములకు సాగునీర్ అందడం లేదని ఆ ప్రాంతం రైతులు కలెక్టర్ కు వినతి పత్రం అందించారు. ఈస్ట్ కోస్ట్

పవర్ ప్లాంట్ కు సంబంధించి ఉన్నాయి 1108 జీవో రద్దు చేయాలనీ, అలాగే థర్మల్ పోరాట కమిటీ సభ్యులు పై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు కలెక్టర్ వినతి పత్రం అందించారు. ఇదిలా ఉండగా జగనన్న కు చెబుతాం కార్యక్రమానికి ప్రచారం పెద్దగా లేకపోవడం తో అర్జీలు అందించే వారు తక్కువయ్యారు.ఈ కార్యక్రమం లో జేసీ నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, ఏఎస్పీ సోమశేఖర్, డిఆర్డిఏ పీడీ విద్యాసాగర్, వివిధ శాఖల లకు సంబందించిన జిల్లా స్థాయి అధికారులు, తహసీల్దార్ చలమయ్య, ఎంపీడీఓ ప్రేమలీల, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వో లు పాల్గొన్నారు.

గురువులకు గురుబ్రహ్మ పురస్కారం

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : విద్యార్థులను ప్రోత్సహిస్తూ విద్యార్థులు వివిధ రకాల పోటీ పరీక్షల్లో ఎదుర్కొనే స్థాయిలో కృషి చేస్తున్న సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం ఉన్నత పాఠశాలకు చెందిన తూట భాస్కరరావు, ఆదర్శ ప్రాథమిక పాటశాల సంతబొమ్మాళి ఉపాధ్యాయులు లాఖినాన వెంకట రమణలకు జాతీయ స్థాయి సేమ్స్ ఒలింపియాడ్ కోఆర్డినేటర్ ఎస్ ఎన్ రెడ్డి, ఎంపిపి ఆర్ ఉమామల్లేశ్వరరావు, జెడ్పిటిసి దుబ్బ వెంకట్రావు, ఎంఇఓ అప్పలరాజు చేతులమీదుగా సన్మానించారు. దుస్సాలువాతో సత్కరిస్తూ జ్ఞాపికలును అందచేసారు. వారిని ఆయా పాటశాలల సిబ్బంది అబినందిచారు. గత ఏడాది నిర్వహించిన జాతీయ స్థాయి ప్రతిభా వరీక్ష సెమ్స్ ఒలింపియాడ్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దండుగోపాలపురము విద్యార్థులు దాసరి.లహరి, వంజరాపు. మనోజకుమర్, ఆదర్శ ప్రాథమిక పాటశాల సంతబొమ్మాళి విద్యార్థులు సత్తా చాటి మంచి ర్యాంకులు రేఖల చందన, కొన్న కళ్యాణిలు ఉత్తమ ప్రతిభ కనబరిచినందులకు జ్ఞాపిక, ప్రశంసాపత్రములు, మెడల్స్ లు అందజేశారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చైతన్య తెలిపారు.

గణిత అవధానికి ఘన సత్కారం

విశాలాంధ్ర-సోంపేట : ఈ మండలం ఇసకలపాలెం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు కలిసి ప్రముఖ గణిత అవధాని మద్దు తిరుపతిరావును గురువారం ఘనంగా సత్కరించారు. కంచిలి మండలం బూరగాంకు చెందిన తిరుపతిరావు

అవధాని ఇసకలపాలెం పాఠశాలలో గణిత అవధానం నిర్వహించి విద్యార్థులను, ఉపాధ్యాయులను అబ్బురపర్చి ఆనందోత్సహాల్లో ముంచెత్తారు. ఈ సందర్భంగా అవధాని గొప్పతనాన్ని, ప్రతిభా పాటవాలను ఎంతగానో ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ధర్మారావు, ఉపాధ్యాయులు మురళీకృష్ణ, మురళీధర్, కూర్మారావు, ప్రసాద్, రవి, మనోహర్, కిషోర్, మనీషా తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ జగనన్న లక్ష్యం : జెడ్పిటిసి వసంతరెడ్డి

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి లక్ష్యం అని సంతబొమ్మాళి జెడ్పిటిసి పాల వసంతరెడ్డి అన్నారు. గోవిందపురం పంచాయతీ లో సర్పంచ్ రెయ్యి రామిరెడ్డి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయనివిధంగా, మన ముఖ్యమంత్రి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టి, పేదప్రజలకు అన్నిరకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించడం అభినందనీయం అన్నారు. అనంతరం జెడ్పిటిసిని ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ జీరు బాబురావు, ఎంపీటీసీ చింతాడ జయ చిన్నారావు, చిన్నారావు వడ్డీవాడ, బోరుబద్ర సర్పంచ్ లు, గూడ్ల మల్లేశ్వరరావు, బుసకల లక్ష్మీ కాంతం ఎంపీటీసీ శిమ్మ సోమేశ్, మాజీ సర్పంచ్ నర్సింగారావు, మండలం వైకాపా యువ నాయకులు రెయ్యి ప్రసాద్ రెడ్డి, వైకాపా నాయకులు ఈశ్వరెడ్డి, మాధవరెడ్డి, పీస పాపారావు, సత్యన్నారాయణ, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ సిబ్బంది, ఆరోగ్యం సురక్ష సిబ్బంది, వాలంటర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-మందస : ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బల్ల సుభాష్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలో పలు పాఠశాలలను సందర్శించి ఆయా ఉపాధ్యాయుల యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొత్త పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలని, ఐటిడిఎ పరిధి పాఠశాలల్లో పీజీ హెచ్.ఎం ప్రమోషన్లు వెంటనే చేపట్టాలని, ఐటిడిఎ పరిధిలో ఆశ్రమ పాఠశాలల్లో వార్డెన్ పోస్టులను మంజూరు చేయకుండా ఉపాధ్యాయులకే అదనపు బాధ్యత ఇవ్వడం సరికాదని తెలిపారు. కార్యక్రమంలో గవ్వ భీమారావు, నల్ల ఢిల్లీరావు, దున్న చంద్రశేఖర్, వి.వి.వరప్రసాద్, దువ్వు వైకుంఠరావు, ఎస్.ప్రభాకరరావు, వి.సత్యం, బి.రామారావు, డి.రామారావు, డి.మోహనరావులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యం బలోపేతం

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలన లో ప్రభుత్వ వైద్యం బలోపేతం అయిందని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండలం కొత్తపేటలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు నేడు పనులతో ఆస్పత్రుల రూపు రేఖలు మారాయని అన్నారు.ప్రతీ గ్రామ పరిధినుంచి పెద్ద ఆస్పత్రులు వరకు పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బంది నియమించిన ఘనత వైఎస్ జగన్మోహన్ రెడ్డి కే దక్కుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ అంబటి శ్రీను ఎంపీటీసీ మాకయ్య సర్పంచులు అట్టడ గోవింద రావు,చింత రాజు, తహసిల్దర్ బి అప్పలస్వామి, ఈవోపీఆర్డి తిరుమలరావు గోవింద పురం పి ఎస్ సి వైద్యులు ప్రత్యూష సుధీర్ కుమార్ వైద్య బృందం ఐసిడిఎస్ సూపర్వైజర్ ధనలక్ష్మి పాల్గొన్నారు.

సాంకేతిక విద్యాబోధన పట్ల జగన్ ప్రత్యేక చొరవ : ఎంపీపీ

విశాలాంధ్ర-సోంపేట : సాంకేతిక విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకు రావాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గ్రామీణ ప్రాంతాల్లో కూడా అందుబాటులోకి తీసుకు రావడం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు అన్నారు. జింకిభద్ర ఉన్నత పాఠశాలను కొత్తగా 9వ తరగతి విద్యార్థులకు తరగతి గదిని జెడ్పీటీసీ తడక యశోద గురువారం ప్రారంభించారు. ప్రస్తుత ప్రభుత్వం పాఠశాలలు, తరగతి గదుల రూపు రేఖలు మార్చి మరింత సౌకర్యవంతంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దిందని అన్నారు.ఈ సందర్భంగా స్థానిక ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులను సన్మానించారు. ఉపసర్పంచ్ జానకిరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులు వ్యవసాయాధికారుల సలహ మేరకు మందులు వాడాలి

టెక్కలి వ్యవసాయ సంచాలకులు బి.వి. తిరుమలరావు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: ఖరీఫులో రైతులు సాగుచేస్తున్న వరితో పాటు కూరగాయల సాగులకు ఎరువులు, పురుగు మందులు, దోమపోటుకు సంబందిం చిన మందులు వాడేముందు స్థానిక వ్యవసాయాధికారులు సలహా మేరకు మందులు వాడాలని టెక్కలి వ్యవసాయ సంచాలకులు బి.వి.తిరుమలరావు అన్నారు.

ఆయన గురువారం హర్చింద్రపురంలో కొత్తమ్మతల్లి ఫార్మర్స్ ప్రొడ్యుసర్ కంపెని లిమిటెండ్ ప్రధమ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వచ్చే రబీ సీజన్‌లో ఆరుతడి పంటలపై దృష్టి సారించాలని, పంట మార్పిడి చేయాలని ఆయన రైతులకు సూచించారు. రైతులు వ్యవసాయ అధికారులు, సహాయకులు సలహా మేరకు మాత్రమే ఎరువులు, పురుగుమందులు వాడాలని లేకుండా పొంట నష్టంతో పాటు మందులు పించకారి చేసి నప్పుడు రైతు ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో సంతబొమ్మాళి, కోటబొమ్మాళి వ్యవసాయాధికారులు రంగరావు, ఎస్. గోవిందరావు, కొత్తమ్మతల్లి ఫార్మర్స్ ప్రొడ్యుసర్ కంపెని లిమిటెండ్ ఓనర్ పూజారి సత్యప్రియ, అఫ్‌మేనేజర్ అప్పారావు, అర్టికల్చర్ అధికారి సునీత, అనూప్ తదితరులు పాల్గొన్నారు.

కష్టకాలంలో అదుకోవడమే మానవత్వం

ప్రధానోపాధ్యాయులు డాక్టర్ రామారావు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : కష్టకాలంలో సాటి మానవుడికి ఆదుకోవడం మానవత్వం చాటుకోవటం అని సంతబొమ్మాళి ఎంపిపి మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు డాక్టర్ అంగూరు రామారావు అన్నారు. విద్యార్థులు పొదుపు చేసుకున్న డబ్బులు తో ఇద్దరు పేదలకు వస్త్రాలు, కొంత ఆర్థిక సాయం గురువారం పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులు చేసారు. ఈ కార్యక్రమం పాఠశాల సెక్రటరీ ఆనందరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పిల్లలు విద్యార్థి స్థాయి నుండి సహాయం చేయడం, కష్టంలో ఉన్న వారికి ఆదుకోవడం నేర్చుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు ఆనందరావు, ఎల్వి రమణ లు మాట్లాడుతూ, పాఠశాలలో ప్రతి 15 రోజులకు ఒకసారి నిర్వహించడానికి విద్యార్థులు, నిర్ణయం తీసుకున్నామని, మనిషిగా పుట్టిన తర్వాత సాటి మనిషికి సహాయం చేయడం మానవ జన్మకి చాలా అవసరమని అది అందరూ పాటించాలని విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరసింహమూర్తి, హరిప్రసాద్, సిమ్మన్న, మయూరి, భవాని, రోజా రమణి, పావని, రజిని, పాల్గొన్నారు.

వైసీపీవి కక్షసాధింపు రాజకీయాలు

మండల టిడిపి అధ్యక్షులు రాజు

విశాలాంధ్ర-ఆమదాలవలస : రాజకీయ కక్షతో చంద్రబాబును అరెస్టు చేసి వైసీపీ నాయకుడు రాక్షస ఆనందం పొందు తున్నారని టిడిపి అధ్యక్షులు, కనుగులవలస సర్పంచ్ నూక రాజు అన్నారు. గురువారం కనుగుల వలస గ్రామంలో ఇంటింటికి తిరిగి చంద్రబాబు అక్రమ అరెస్టుపై కరపత్రాల అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అరెస్టు చేసి 35 రోజులు అవుతున్నప్పటికీ కనీసం ఒక్క ఆధారం కూడా చూపించలేని ఏసీబీ అధికారులు కేవలం జగన్మోహన్ రెడ్డి మెప్పుకోసమే అక్రమ అరెస్టులు చేపట్టారని విమర్శించారు. బాబు కోసం మేము అంటూ ఇంటింటికి ప్రభుత్వ వైఫల్యాలను వివరించి చంద్రబాబుకు మద్దతు కూడగట్టారు. నైపు ణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాల్లో శిక్షణ అందించి పారిశ్రామిక ప్రగతికి చర్యలు చేపట్టిన చంద్ర బాబుపై అక్రమ అరెస్టులు అవినీతి ఆరో పణలు చేస్తున్న వైసిపి రానున్న రోజుల్లో తగు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చ రించారు. మచ్చలేని చంద్రుడిని ఇరుకున పెట్టాలన్న ఉద్దేశమే వైసిపి వారిదని దీన్ని ప్రజలు గ్రహిస్తున్నారని ప్రజాగ్రహానికి వైసీపీ గురికాక తప్పదన్నారు. చంద్రబాబుకు పెరుగుతున్న జనాదరణ చూసి ఓర్వలేక అక్రమ కేసులు బనాయించారని త్వరలోనే కడిగిన ముత్యంలా బయటకు వస్తారని తెలిపారు. ఆయనతోపాటు గ్రామంలోని మహిళలు తెలుగుదేశం పార్టీ అభిమానులు పాల్గొని ఇంటింటికి తిరిగి వైసీపీ అక్రమాలను వివరించారు.

సాగునీరందక సుసరాం రైతులు అవస్థలు

విశాలాంధ్ర-పోలాకి : వరి సాగు పొలాలకు సాగు నీరు అందక సుసరాం రైతులు అవస్థలు పడుతున్నారు. ఈ మేరకు మండలంలో గల ససరాం ప్రాంతంలో కాలువ పక్కన ఉన్న పొలాలకు సాగునీరు అందడంలేదని రైతులు ఆందోళన చెందు తున్నారు. ఈ సమస్య గత మూడు సంవత్స రాలు నుండి ఉంటున్నట్లు రైతులు చెప్తున్నారు. సాగు నీరు అందక నీటి ఇంజన్లుతో వరి పొలాలుకు నీరు అందిస్తున్నట్లు చెప్తున్నారు. ఇటువంటి పరిస్థితిలో అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకపక్క ఎండలు మరోవైపు వర్షాలు లేక ఇటు సాగునీరు అందక రైతులు తల్లడిల్లుతున్నారు. గాతలవలస జంక్షన్ నుండి సుసరాం పరిధిలో ఉన్న పొలాలకు సాగునీరు లేక నీటి ఇంజిన్లు పైనే ఆధారపడ వల్సి వస్తుందని చెప్తున్నారు. ఇటువంటి పరిస్థితి ఎవరికీ చెప్పుకోలేక రైతులు నీటి ఇంజన్లు పై ఆధారపడ్డారు. ఈ దుస్థితి పై అధికారులు జాడ లేక ప్రజాపతినిధులు చర్యలు లేక రైతులు పెదవి విరుస్తున్నారు.

పోటీ పరీక్షలతోనే విద్యార్థులకు భవిష్యత్ : ఎంపీపీ

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: విద్యార్థులు చిన్ననాటినుంచి పోటీ పరీక్ష లను అలవాటు చేసుకోని వారి ప్రతిభను కనబర్చు కోవాలని ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులకు పోటీపరీక్షల ద్వారానే భవిష్యత్ ఉంటుం దని స్థానిక ఎంపీపీ రోణంకి ఉమా మల్లేశ్వరరావు,

జడ్పీటీసీ దుబ్బ వెంకటరావులు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో గత యేదాది నిర్వహించిన జాతీయ స్థాయి ప్రతీభా పరీక్ష సెమ్స్ ఒలింపియాడ్ పరీక్షలలో జిల్లా స్థాయిలో ప్రధమ స్థాయి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సత్కరించి నగదుబహుమతులతో పాటు జ్ఞాపిక, ప్రసంసాపత్రం సీల్డ్‌ను స్థానిక మండల విద్యాశాఖాధికారి ఎస్. అప్పలరాజు, ఎంపీడీవో కె. ఫణీంద్రకుమార్‌ల, సెమ్స్ సంస్థ స్థాపకుడు శ్రీరెడ్డి ఆద్వర్యంలో అందజేశారు. ఈ అవార్డు గెలుసుకున్న విద్యార్థులు కోటబొమ్మాళికి చెందిన బ్లూమిండ్‌బడ్స్ ప్రైవేటు పాఠశాలతో పాటు జిల్లాల్లో పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఉన్నారు. కాగా పాఠశాలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థుల ఉపాధ్యాయులకు గురుబ్రహ్మ పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సెమ్స్ ఓలంపియాడ్ ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

ఊడికలపాడుతో పారిశుధ్య పనులు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మండలం చీపుర్లపాడు పంచాయతీలో శ్రీపురం నుంచి ఊడికలపాడు మీదుగా సీతన్నపేటవరకు గురువారం సర్పంచ్ నేతింటి చిన్నమ్మడు అప్పలస్వామి పారిశుద్యపనులు నిర్వహించారు. కొత్తమ్మతల్లి, దసర పండుగలు సందర్భంగా రోడ్డుకు ఇరువైపుల జంగిల్ క్లియర్ చేయించారు. రోడ్డుకు చిన్నచిన్న మరమ్మత్తులు చేయించి గ్రామాల్లో డ్రైనేజీలు శుభ్రపరిచి బ్లీచింగ్ చల్లించారు.

కషాయాలు ఉండగా... రసాయనాలు దండగ అంటున్న రైతులు

విశాలాంధ్ర-ఆమదాలవలస: మండలంలో ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా చేపేనపేట, నిమ్మతొర్లువాడ, జి.కెవలస, కొరపాం గ్రామాలలో రైతులు ప్రకృతి వ్యవసాయ పద్దతిలో తయారు చేసుకున్న కాషాయాలను పంటలలో పిచికారీ చేస్తున్నారు. ఈ సందర్భంగా యూనిట్ ఇంఛార్జి నక్క చిరంజీవి మరియు డిజిటల్ యల్ - 2 సురేష్ మాట్లాడుతూ రైతులు వరి పంట లో వచ్చే పురుగులు, తెగుళ్ళు, ఉధృతిని నివారించడం కోసం పలు రకాల కషాయాలను తయారు చేయించి పిచికారి చేయిస్తున్నామని అన్నారు. ఇందులో భాగంగా రైతులతో ప్రధానంగా వరి పంటలో వచ్చే పొటాస్ మరియు ఇతర సూక్ష్మ పోషక లోపాలను అధిగమించడానికి జిల్లేడు కషాయాన్ని ఎక్కువ మోతాదు లో పిచికారి చేయించామని తెలిపారు. ప్రస్తుతం పంటలో దోమ ఉధృతి ఉండడం వలన తూటికాడ కషాయాన్ని రైతులతో పిచికారి చేయిస్తున్నామని తెలిపారు. రైతులు కషాయాలను ఎంతో ఆసక్తితో తయారు చేసుకుంటున్నారని తెలిపారు.

బిజెపి అధ్యక్షురాలు పురందేశ్వరిపై అనుచిత వ్యాఖ్యలు తగదు

- వైసీపీ లో ఓటమి భయం మొదలైంది.
- బిజెపి జిల్లా అధ్యక్షులు బిర్లంగి ఉమామేశ్వరరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి చంద్రబాబుకు బెయిల్ ఇప్పించడం కోసమే నారా లోకేష్ ను హోం శాఖ మంత్రి అమిత్ షా వద్దకు తీసుకెళ్లారంటూ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, ఈ వ్యాఖ్యలను బిజెపి నిర్ద్వందంగా ఖండిస్తోందని బిజెపి జిల్లా అధ్యక్షులు బిర్లంగి ఉమామహేశ్వరరావు అన్నారు. నగరంలోని విజేత హోటల్లో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బిజెపి ప్రతిపక్ష పాత్ర పోషిస్తుందని, పురందేశ్వరి రాష్ట్ర అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టి తరువాత బిజెపి నిర్మాణాత్మకంగా ముందుకు వెళుతోందని, ఇది చూసి వైసీపీ నాయకుల్లో ఓటమి భయం మొదలైందని, అందుకే వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని ఆయన అన్నారు. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందని, పక్క రాష్ట్రాల నుంచి మద్యం ఆంధ్రప్రదేశ్‌లోకి దిగుమతి అవుతోందని ఆమె వాస్తవాలను ప్రజలకు వెల్లడించారన్నారు. అప్పుడు ఓర్వలేని వైసిపి నాయకులు పోసాని కృష్ణమురళితో ఆమెపై వ్యక్తిగతంగా మాటల దాడికి పాల్పడ్డారని గుర్తు చేశారు. ఇటువంటి అనైతిక చర్యలు వైసీపీకి పరిపాటిగా మారిందన్నారు. కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలు పోతున్నా వైసీపీ పట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం నిర్వాసితులకు

ఇప్పటివరకూ న్యాయం చేయకపోగా బాధితులకు కనీసం భరోసా కల్పించలేని స్థితిలో ఉన్న ఆ శాఖ మంత్రి అంబటి నోటి పారుదల మంత్రిగా కాకుండా నీటి పారుదల మంత్రిగా పని చేస్తే బాగుండేదని ఈ పాటికి పోలవరం పూర్తి అయ్యేదన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్ళు కావొస్తున్నా, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఎందుకు త్వరితగతిన పూర్తి కావడంలేదో చెప్పాలన్నారు. నీటిపారుదల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి నేటి వరకు ప్రాజెక్టు నిర్మాణంపై ఎన్ని సమీక్షలు నిర్వహించారని అంబటి ని ప్రశ్నించారు. ఇక రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మౌత్ పీస్ అయిన సజ్జల రామకృష్ణరెడ్డి పురందరేశ్వరి పై వ్యక్తిగత నిందలు వేస్తుండడం సబబు కాదన్నారు. వైసీపీలా బీజేపీ కుటుంబ, కుల పార్టీ కాదని, అభివృద్దే ధ్యేయంగా పనిచేసే పార్టీ అని హితవు పలికారు. తప్పు చేసిన మీ కుటుంబ సభ్యులను మీరు వెనకేసుకొస్తారు కానీ బీజేపీ లో ప్రతి ఒక్క వ్యక్తి పార్టీ సిద్ధాంతాలకి కట్టుబడి ఈ దేశం కోసం పనిచేసే వారని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు అధిక శాతం నిధులు కేంద్రం ఇస్తున్నా, క్రెడిట్ మొత్తం మీరే తీసుకుంటున్నారని, కేంద్ర నిధులు దారి మళ్లించి మీ సొంత పథకాలు పేర్లు మార్చి స్టిక్కర్లు వేసుకోవడం ఎంతవరకు సబబు అని నిలదీశారు. ప్రతిపక్ష పార్టీ భాజపా ప్రశ్నిస్తే తప్పులు సరిదిద్దుకోవాల్సింది పోయి వారిపై వ్యక్తిగత విమర్శలు, భౌతిక దాడులు పాల్పడడం ప్రజాస్వామ్య విధానానికి విరుద్ధం అన్నారు. వైసీపీ నాయకుల వ్యక్తి గత దూషణలు బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అట్టాడ రవి బాబ్జీ, శవ్వాన ఉమామహేశ్వరి, సీనియర్ నాయకులు, చల్లా వెంకటేశ్వర రావు, శవ్వాన వెంకటేశ్వరరావు జిల్లా ప్రధాన కార్యదర్శి చింతపల్లి దుర్గారావు గాంధీ, మహిళా మోర్చా నాయకురాలు పేడాడ సూర్యకుమారి, గొలివి కరుణాకర్, రావాడ పురుషోత్తం, ఇప్పిలి సీతరాజు, పూజారి చల్లయ్య, సాధూ మల్లేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష దేశానికే ఆదర్శం : ఎమ్మెల్యే శాంతి

విశాలాంధ్ర-పాతపట్నం: మండలం కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఏ పేదవాడు డబ్బులేక వైద్యానికి దూరంగా ఉండకూడదని ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా ఆంధ్రప్రదేశ్ లో ప్రతి కుటుంబ ఇంటి వద్దకే నాణ్యమైన వైద్యం అందించడమే ఈ కార్యక్రమం లక్ష్యం అని ఎమ్మెల్యే రెడ్డి శాంతి పత్రికా ముఖంగా తెలియజేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా గ్రామాన్ని పూర్తిగా మ్యాపింగ్ చేసి. ప్రతి గ్రామంలోనూ, ప్రతి ఇంటినీ, జల్లెడ పట్టి, ఏ ఇంట్లో ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉన్నా ఆ ఇంటి దగ్గరే 7 రకాల పరీక్షలు చేసి వారికి వైద్య సేవలు అందించేటట్టుగా రూపొందించిన ఈ కార్యక్రమం ప్రజారోగ్య రంగంలో కీలక పాత్ర పోషిస్తోందని ఆమె అన్నారు. గతంలో ఆరోగ్యశ్రీ పథకం తో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఒక సంచలనాన్ని సృష్టించారని ఆయన ప్రజల కొరకు ఒక అడుగువేస్తే ఆయన తనయుడు మన ముఖ్యమంత్రి శ్రీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేదవారికోసం నాలుగడుగులు ముందుకు

వేస్తూ రాష్ట్రంలో ప్రజలు డబ్బుల్లేక వైద్యానికి దూరం కాకూడదని ఆలోచించి జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా పేదల బ్రతుకుల్లో వెలుగులు నింపుతూ దేశం లో ఏ రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అమలు చేయలేని బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ పథకం అమల్లో భాగంగా ప్రతి వ్యక్తి యొక్క ఆరోగ్య సమస్యలు తెలుసుకొని రక్తపోటు, మధుమేహం, గర్భిణులు, బాలింతల సమస్యలతో పాటు రక్తహీనత సమస్య ఉన్నవారిని గుర్తించి సరైన మందులు ఉచితంగా అందిస్తారు. ప్రతి క్యాంపులో 14 రకాల వైద్య పరీక్షలతో పాటు 172 రకాల మందులను అందుబాటులో ఉంచారు. అవసరం మేరకు కంటి పరీక్షలు, ఈసీజీ, రక్త పరీక్షలు, ఫుడ్ సప్లిమెంటేషన్ మ్యాపింగ్ చేస్తున్నారు. మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రులకు రిఫర్ చేసిన వారికి ఉచితంగా వైద్య సేవలు అందించేలా ఫ్యామిలీ డాక్టర్లు, ఏఎన్ఎం, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌వో) పర్యవేక్షిస్తున్నారు. ఐదు దశల్లో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. మలేరియా,డెంగీ పరీక్షలను నిర్వహించి. వారికి అవసరమైన మందులను ఉచితంగా అందివ్వడం జరుగుతోందని, అలాగే ప్రతీ జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రంలోఇద్దరు స్పెషలిస్ట్ డాక్టర్లు ఉంటారన్నారు. 45రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా క్యాంపులు నిర్వహించడం జరుగుతోందని అన్నారు. రాష్ట్రంలో ప్రతి గ్రామం, ప్రతి ఇల్లు, ప్రతి వ్యక్తిని కవర్ చేస్తారు. వీటి ఫలితాలను మొబైల్‌యాప్‌లో అప్‌డేట్ చేస్తున్నారన్నారు. వైద్య శిబిరంలో అవసరమైన వారికి ఇతర పరీక్షలు చేసి మందులు,ఇవ్వటమే కాకుండా కంటికి సంబంధించిన ఆపరేషన్లు ఉచితంగా చేసి కళ్లద్దాలను, మందులను ఉచితంగా ఇస్తున్నారు. ఈ వైద్య శిబిరం లో 105 రకాల మందులను అందుబాటులో ఉంచారు. జగన్ మోహన్ రెడ్డి నిజంగా వైద్యో నారాయణో హరిః అనే పదానికి మూలం ధన్వంతరి. శ్రీ మహా విష్ణువు అవతారంలో ధన్వంతరి రూపంలో మన రాష్ట్రం లో సుమారు 5 కోట్ల 40 లక్షల మంది ప్రజలు బాగుండాలని కోరుకుంటున్న జగనన్నకు నా హృయపూర్వక నమస్కారాలు తెలియజేస్తున్నాను. ప్రపంచంలో అగ్ర దేశాలు వైద్య శాస్త్రం లో గాని, వైద్య పరికరాలలో గాని ఆధునీకరణ ఉన్నప్పటికీ ఎక్కడ లేని విధంగా మన ముఖ్యమంత్రి గారు ప్రజలు నిండు నూరేళ్ళు చల్లగా ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్య ఉద్దేశం అని అన్నారు.

చంద్రబాబు కోసం పాదయాత్ర

- అరసవల్లి నుంచి సింహాచలం వరకు...
- 100 కిలోమీటర్ల మేర పాదయాత్రకు సిద్ధం
- అరసవల్లి సూర్యనారాయణస్వామికి చంద్రబాబు పేరిట ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: టీడీపీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అరెస్టు అయిన నాటి నుంచి 30 రోజులుగా అలుపెరగని పోరాటం చేస్తూ తమ నాయకుడి కోసం ముందుకు వెళ్తున్నారు. ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షులు, టీడీపీ యువకులు గొండు శంకర్. దీక్షలు, ర్యాలీలు, నిరసనలు, పోస్టుకార్డు ఉద్యమం అన్నింటిలోనూ చిత్తశుద్ధితో కార్యక్రమాలను నిర్వహిస్తూ తాను నమ్ముకున్న పార్టీకి, తమను ఆదుకున్న నాయకుడు చంద్రబాబుకు అండగా నిలుస్తున్నారు. అందులో భాగంగా చంద్రబాబునాయుడు నిర్దోషిగా విడుదల కావాలని, ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయం నుంచి విశాఖపట్నం సింహాద్రి అప్పన్న ఆలయం సింహాచలం వరకు పాదయాత్రను ప్రారంభించారు. సుమారు 100 కిలోమీటర్ల మేర ఈ పాదయాత్ర కొనసాగుతోంది. గురువారం ఉదయం అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయంలో చంద్రబాబునాయుడు పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా గొండు శంకర్ మాట్లాడుతూ చంద్రబాబునాయుడు అరెస్టుతో తనకేమీ సంబంధం

లేదని జగన్‌మోహనరెడ్డి చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. చంద్రబాబు అరెస్టు, నిర్బంధం రాజకీయ కక్షలో భాగమేనని ఇప్పటికే రాష్ట్ర ప్రజలు తెలుసుకున్నారని, ప్రజలను మభ్యపెట్టే మాటలను వైసీపీ నాయకులు కట్టి పెట్టాలని శంకర్ హితవు పలికారు. 45 ఏళ్లుగా తెలుగుప్రజలకు చంద్రబాబు తన నిస్వార్థ సేవలను అందించారని, తెలుగు ప్రజల ప్రయోజనం కోసం తన జీవితాన్ని పణంగా పెట్టారని శంకర్ గుర్తు చేశారు. చంద్రబాబును ప్రజల మనసుల నుంచి వేరు చేయలేక 73 ఏళ్ల వయసులో ఆధారాలు లేని కేసులో చంద్రబాబును ఇరికించి అరెస్టు చేసి, ఆ తరువాత ఆధారాలు వెతుక్కోవడం అంటే అంతకంటే దుర్మార్గమైన చర్య మరొకటి లేదని పేర్కొన్నారు. తన అరాచక పాలనతో, సైకో ఆలోచనలతో జగన్‌మోహనరెడ్డి ప్రజలను అష్టకష్టాల పాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పులను ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేయిస్తూ రాక్షసానందం పొందుతున్న జగన్‌మోహనరెడ్డికి మంచి బుద్ధి ప్రసాదించు స్వామి అంటూ సూర్యనారాయణస్వామిని వేడుకున్నట్లు వివరించారు. నాలుగున్నరేళ్ల జగన్ పాలనను చూసి ప్రజలు ఏపీ హేట్స్ జగన్ అంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గం ప్రెసిడెంట్ రెడ్డి గిరిజా శంకర్, పాత్రుని వలస మాజీ సర్పంచ్ పంచిరెడ్డి అప్పల నాయుడు, నియోజకవర్గం తెలుగు యువత కార్యదర్శి గొండు శ్యామ్ సుందర్ రావు, మాజీ కౌన్సిలర్ పాండ్రంకి శంకర్ మాజీ కౌన్సిలర్ కౌన్సిలర్ అంబటి లక్ష్మీరాజ్యం మాజీ ఎంపిటిసి మట్టానందు సర్పంచ్ సానివాడ సానివాడ సర్పంచ్ రుప్ప రమణమూర్తి ,గురుగు లక్షణ, బైరి మాజీ సర్పంచ్ ఎందు చిన్నారావు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ బొల్ల నాగేంద్ర యాదవ్ యళ్ల నాగరాజు, పొదిలపు సింహాచలం, పొన్నాడ కిషోర్, పొన్నాడ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కాలువలో నీరు రాక రైతుల పాట్లు...

విశాలాంధ్ర-ఆమదాలవలస: ఓ పక్క వర్షాభావం పరిస్థితి ఎదురవడంతో పాటు పంట కాలువలు నీరు రాకపోవడం తో రైతులకు సాగునీటి ఇబ్బందులు తప్పట్లేదు. నారాయణపురం ఎడమ కాలువ కొర్లకోట హై లెవెల్ కెనాల్ దిగువనున్న రైతులకు సాగు నీటి కోసం నాన తంటాలు పడుతు న్నారు. అధికారుల అలసత్వం రాజకీయ నాయకుల నిర్లక్ష్యం వెరసి సకాలంలో కాలువలో నీరు అందటం లేదు. సాగునీటి కాలువల్లో పూడిక తీయకపోవడం వలన ఈ పరిస్థితి ఎదురవు తుంది. ప్రతి ఏటా ఖరీఫ్ ప్రారంభానికి ముందు సాగునీటి కాలంలో పూడికలు తొలగిస్తామని పాలకుల హామీ ఇచ్చిన నేటికీ నెరవేరుని పరిస్థితి ఉంది. వేలాది రూపాయ లు పెట్టుబడులు పెట్టిన రైతులు వరి చేలు పొట్ట దశలో ఉన్నాయి. వెదుళ్ళ వలస, చీమ లవలస, కొర్లకోట, రావి కంటి పేట ప్రాంతాల్లో సాగునీరు అందక పంట పొలాలు ఎండి పోతున్నాయి. పంటను కాపాడుకునే ప్రయ త్నంలో రైతులు వేలాది రూపాయలు వెచ్చిం చి ఆయిల్ ఇంజన్లతో పైపుల ద్వారా చెరువు ల్లో నీటిని పొలాలకు తరలిస్తున్నారు. గురు వారం వెదుళ్ళ వలస గ్రామానికి తాగు నీరు ప్రారంభించేందుకు వచ్చిన శాసన సభాపతి

తమ్మినేని సీతారాంకు స్థానిక రైతులు హై లెవెల్ ఛానల్ లో నీరు రాకపోవడంపై వివరించారు. ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ విషయమై ఇరిగేషన్ ఇంజనీర్ కొత్తకోట రాంబాబు ను వివరణ కోరగా నారాయణపురం వద్ద నీటి నిల్వ ఉంటే కొత్తగడ్డ ద్వారా నీరు వస్తుందని అందుకు సంబంధించి తోటపల్లి రిజర్వాయర్ ద్వారా నీటిని విడుదల చేసేందుకు ఎస్ ఇ స్థాయి అధికారులతో మాట్లాడాలని తెలిపారు.

ఆరోగ్య ఆంధ్ర సాధనే జగనన్న లక్ష్యం

విశాలాంధ్ర-పొందూరు: రాష్ట్ర ప్రజల ఆరోగ్య సంక్షేమానికై ఇంటింటా ప్రజా వైద్య సేవలు అందించే బృహత్తరమైన ఆరోగ్య సురక్షతో ఆరోగ్య ఆంధ్ర సాధనే ధ్యేయంగా జగనన్న లక్ష్యమని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు పప్పల రమేష్ కుమార్ అన్నారు. మండలం లైదాం గ్రామంలో సర్పంచ్ గొరైల రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మాట్లాడుతూ పై విధంగా అన్నారు. ప్రతి పేద రోగులకు అందుబాటులో వైద్యం అందించాలన్న మంచి దృక్పథంతో కోట్లాది రూపాయల వెచ్చించి బృహత్తరమైన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్య ప్రజలందరూ వినియోగించుకోవాలని మండల ఎంపీపీ ఉషారాణి అన్నారు. వైసీపీ రాష్ట్ర వాణిజ్య విభాగ్ ప్రధాన కార్యదర్శి బండారు జై ప్రతాఫ్ కుమార్ మాట్లాడుతూ రోగులపాలిట దేవాలయంగా ఆసుపత్రులను మార్చాలన్న ఆశయంతో కృషి చేస్తున్న జగనన్న ఆశయానికి అందరూ ప్రోత్సహించాలని ఆయన కోరారు. ముందుగా డాక్టర్ సాగరికతో కూడిన వైద్య సిబ్బంది రోగులకు చికిత్సను అందించారు. విష జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని వారు కోరారు. అవసరమైన రోగులకు రక్తములను సేకరించారు. బిపి షుగర్ వంటి పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. ఈ కార్యక్రమంలోవైసిపి నేతలు బాడాన కృష్ణ, కోల్లు శ్రీనివాసరావు, రామి నాయుడుపొందూరు పట్టణ పార్టీ అధ్యక్షులు గాడు నాగరాజు,పొందూరు మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ అనకాపల్లి గోవిందరావు, పలువురు ఎంపీటీసీలు సర్పంచులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఇంటింటికీ వైసీపీ పాపాల ప్రచారం

విశాలాంధ్ర-పొందూరు : రాష్ట్రంలో విచ్చలవిడిగా దౌర్జన్యాలు అక్రమాలకు పాల్పడి వైసిపి పాపాల పాలకులకు వెంటబెట్టే రోజులు ఆసన్నమైందని జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర్ భాస్కరరావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మండలంలో లోలుగు కింతలి గ్రామాల్లో జరిగే బాబుతో నేను అనే కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టులను ప్రజలకు వివరించే రీతిలో ప్రచారం నిర్వహిస్తూ సర్కారుపై మండిపడ్డారు. వైసీపీకి బుద్ధి చెప్పి రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కింతల్ సర్పంచ్ పైడి రాంప్రసాద్, ఎంపీటీసీ కూటికుప్పల హనుమంతురావు, లోలుగు వెంకట్, చొల్ల శ్రీనివాసరావు, లావేటి జోగి నాయుడు,చోళ గోవిందా, కూన శ్రీనివాస్, సింగూరు రామారావు తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

విశాలాంధ్ర-కవిటీ: మండలంలోని గొర్లేపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విధులు చేపట్టి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా గురువారం ఎంపీ యూపీ పాఠశాలలో విధులు చేపట్టి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు టి.నాగరాజు, వి.రామారావుకు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ కరగాన వసంత వల్లభరావు, కే రామారావు, వి.సీతంనాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆన్ లైన్ షాపింగ్ మోసం

విశాలాంధ్ర-మెళియాపుట్టి: ఆన్ లైన్ లోని షాపింగ్ చేసి మోసపోయిన సంఘటన మండలంలో వెలుగు చూసింది. దీనికి సంబంధించి వివరాల్లోకి వెళ్తే మండలంలోని పద్ద గ్రామానికి చెందిన జగన్ జెన్నా అనే యువకుడు ఇటీవల ఐదు రోజులు క్రితం సుమారు 2300 రూపాయిలు వెచ్చిస్తూ అమేజాన్ అనే ఒక ప్రైవేటు యాప్‌లో డ్రోన్ ను బుకింగ్ చేశారు. అయితే అది బుధవారం నాడు యాప్ డిలవరీ బాయ్ వస్తువును డిలవరీ చేయగా తర్వాత వారు ఆ పెట్టెను తెరిచి చూడగా సుమారు 15 రూపాయిల స్కెచ్ పెన్ ప్యాకేట్లు రావడంతో నిర్ఘాంతపోయారు. అనంతరం తాము మోసపోయామని గుర్తించారు. అయితే గతంలో పలుమార్లు ఆన్ లైన్ లో షాపింగ్ చేసినట్టు బాధితులు తెలియజేస్తూ ఎప్పుడు ఇటువంటి సంఘటనలు జరగలేదని నేడు ఇలా జరగడం ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. దీని విషయమై స్థానిక ఎస్ఐ వద్ద ప్రస్తావించగా అధికమొత్తంలో నగదును వెచ్చించి ఆన్ లైన్ షాపింగ్‌లు చేయవద్దని సూచించారు.

ప్రభుత్వానికి తప్పుడు విధానాలు

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : వై.సి.పి అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్రంలో విధ్వంసం కొనసాగుతుందని తెలుగుదేశం పార్టీ నాయకులు అన్నారు. గురువారం బెల్లుపడాలో తెలుగుదేశం పార్టీ 13వ వార్డు ప్రతినిధి రెయ్యి జానకిరావు ఆధ్వర్యంలో బాబుతో మేము కార్యక్రమాన్ని చేపట్టి ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై అక్రమ కేసులతో అరెస్టు చేసి నిర్బంధించి మానసిక హింసకు గురి చేస్తున్నారని ప్రజలకు వివరించారు. ప్రజలను పథకాల పేరుతో మభ్య పెడుతు రాష్ట్రంలో రాక్షస పాలన సాగిస్తున్న అధికార పార్టీకి బుద్ధి చెప్పాలని కోరారు. అధికార వై.సి.పి తప్పుడు విధానాలు అవలంభిస్తుందని, కూల్చి వేతలు ఆక్రమణలు, ప్రత్యర్థి పార్టీలకు చెందిన నాయకులే లక్ష్యంగా దాడులకు తెగబడుతున్నారని వీటన్నింటినీ ఎదుర్కొని సురక్షిత పాలన అందివ్వడానికి తెలుగుదేశం పార్టీకి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేసారు.

యువతి మృతిపై ఐదుగురి అరెస్ట్

విశాలాంధ్ర-మెళియాపుట్టి : మండలంలోని ముకుందపురం గ్రామ పంచాయతీ పరిధిలో గల పరసనాపురం గ్రామానికి చెందిన జన్ని అశ్విని (21) అనే యువతి వరకట్న వేదింపులతో ఇటీవల బలవన్మరణానికి పాల్పడిన నేపథ్యంలో డీఎస్పీ వాసుదేవరావు ఆదేశాలతో మృతురాలి భర్త కృష్ణారావుతో పాటు జన్ని తులసమ్మ, జన్ని పుచ్చయ్య, గొడ్డూరు శ్రీదేవి, గొడ్డురు రాజ్యలక్ష్మిల పై కేసు నమోదు, అరెస్టు చేసి గురువారం నాడు కోర్టుకు తరలించినట్లు స్థానిక ఎస్సై రాజేష్ తెలిపారు.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి యువ క్లబ్బులు

జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు

విశాలాంధ్ర-ఆమదాలవలస: జిల్లాలో పర్యాటక ప్రాంతాల ప్రాధాన్యతను తెలియజేసి వాటిని మరింత అభివృద్ధి చేసేందుకు యువ క్లబ్బులు ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా పర్యాటక అధికారి ఎన్ నారాయణరావు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల తో పాటు, భవిత పాఠశాలలో పర్యాటక ప్రాంతాల ప్రాధాన్య

తను విద్యార్థులకు తెలియజేసేందుకు గురువారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాగా పేర్కొంటున్న శ్రీకాకుళం జిల్లాలో 114 చారిత్రక ప్రదేశాలు, 67 బీచ్ లు ఉన్నాయని తెలిపారు. వీటి ప్రాధాన్యతను అందరికీ తెలియజేసేలా యువ క్లబ్బులు పని చేస్తాయన్నారు. ఒక్కో యువకులు 30 మంది ఆయా పాఠశాలలు కళాశాలలోని విద్యార్థులను నియమిస్తామని తెలిపారు. వీరికి ఈ ప్రాధాన్యతను తెలియ జేసి ప్రజలకు విస్తృతంగా తెలియజేసేందుకు అవగాహన కార్యక్రమాలు భవిష్యత్తులో ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ స్వామి, పర్యాటక శాఖ కోఆర్డినేటర్ ఎన్ ఈశ్వరరావు, భవిత పాఠశాల కరస్పాండెంట్ ఎస్ మురళీధర్ రావు, హెచ్ఎం వెంకటేశ్వరరావు, ఉపా ధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. ముందుగా కళాశాల భవిత పాఠశాల ప్రిన్సిపాల్, హెచ్ఎం లకు యువ క్లబ్బులకు సంబంధించిన ధ్రువపత్రాలను అందించారు.

చంద్రబాబు అక్రమ అరెస్టు కక్ష పూరితం

విశాలాంధ్ర-పలాస: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి కక్ష పూరితంగా టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును అక్రమ అరెస్ట్ చేసి జైలుకు పంపించారని మాజీ కౌన్సిలర్లు సవర రాంబాబు, కొండే నర్సింహులు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని మూడో వార్డు పద్మనాభ పురం, జయ రామచంద్రపురం తదితర ప్రాంతాల్లో బాబుతో నేను కార్యక్రమాన్నినిర్వహించారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు, పలాస నియోజకవర్గంలో గౌతు శిరీషను గెలిపిస్తే రాష్ట్రంతో పాటు నియోజకవర్గం అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే జగనన్నకు శ్రీరామరక్ష : స్పీకర్

విశాలాంధ్ర-పొందూరు: రాష్టంలో ప్రజలకందించే సంక్షేమ పథకాలే జగనన్న కు శ్రీరామరక్ష అని ఆంధ్రప్రదేశ్ శాసన సభాపతి తమ్మినేనిసీతారాం పేర్కొన్నారు. గురువారం పొందూరు మండలంలో సింగూరు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు గడపలకు వెళ్లి లబ్దిదారులతో నేరుగా మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా

పథకాలు అందించే ఘనత సర్కార్కే దక్కిందని పేర్కొన్నారు. పథకాభివృద్ధితో ప్రగతి బాటలో నడిచే ప్రభుత్వం మనదన్నారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా చేరుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వ సేవలు, పథకాలు ఎలా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు.ఇప్పటివరకు గడిచిన నాలుగేళ్ల లో ప్రభుత్వం వివిధ పథకాల రూపంలో అందించిన ఆర్థిక ప్రయోజనాలను వివరించారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పరిపాలన ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారికి నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేసి ఆర్థిక భరోసా కల్పిస్తున్నారన్నారు.నిరుపేదల గౌరవాన్ని పెంచేలా జగన్ ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. జగన్మోహన్ రెడ్డి ఆలోచన, ఆశయానికి ప్రతిరూపంగా ఉన్న గడపగడపకు మన ప్రభుత్వ లక్ష్యం ఉద్దేశాన్ని ఆయన ప్రజలకు వివరించారు. ప్రజాసమస్యల పరిష్కారమే ప్రథమ కర్తవ్యం అన్నారు.సాంకేతిక పరమైన సంక్షేమ పథకాలు అందకపోతే, గ్రామ సచివాలయం ద్వారా దరఖాస్తులు సమర్పించాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ కిల్లి నాగేశ్వరరావు, జెడ్పీటీసీ లోలుగు కాంతారావు పి ఎ సి ఎస్ అధ్యక్షులు కొంచాడ రమణ మూర్తి, మండల పార్టీ అధ్యక్షులు పప్పల రమేష్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ బడాన సునీల్,మండల సచివాలయాల కోఆర్డినేటర్ భాదాన కృష్ణ స్థానిక సర్పంచ్ పైది చంద్రమాని, స్థానిక నాయకులు పైడి ధనుంజయరావు, బొడ్డేపల్లి ఆనందరావు, తమ్మినేని సత్యం,బొడ్డేపల్లి దామోదర్, తదితర వైయస్సార్ పార్టీ సర్పంచులు ఎంపీటీసీలు నాయకులు కార్యకర్తలు అధికారులు సచివాలయం సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యవంతమైన జీవితం సాధ్యం

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: మండలం కరజాడ గ్రామం లో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్వీప్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ అప్పన్న మరియు ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది ఈశ్వర్ సంయుక్తంగా విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయం అవగాహన కల్పించారు. ప్రస్తుత రోజుల్లో రసాయన మరియు పురుగు మందుల ఉపయోగించి పంటలు సాగు చేయడం వలన అది ఆరోగ్యాలు పై ఎటువంటి ప్రభావాలను చూపిస్తుందో తెలియచేశారు. పై రాబోయే తరం వారికీ రసాయనక పురుగు మందులు వాడకుండా, వాటి వలన వచ్చే దుష్ప్రభావాలు గూర్చి అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వలన రాబోయే రోజులలో మంచి ఆహార ఉత్పత్తిని సమాజానికి అందించవచ్చునని అలాగే భవిష్యత్ తరాలకు సారవంతమైన నేలను ఇవ్వవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో సంతు మరియు దాలమ్మ పాల్గొన్నారు.

పేదలకు రక్ష జగనన్న ఆరోగ్య సురక్ష

విశాలాంధ్ర-హిరమండలం: జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు శ్రీరామ రక్ష, ప్రజా రోగ్యానికి జగనన్న రక్ష, జగనన్న ఆరోగ్య సురక్ష దేశం లో ఎక్కడా ఇలాంటి సేవలు లేవని ఆరోగ్యాంధ్ర ప్రదేశ్‌గా మార్చడమే సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఉద్దేశ్యమని మండల వైస్సార్సీపీ అధ్యక్షులు మీసాల వి రామకృష్ణ, జె సి ఎస్ మండల కన్వీనర్ అంద వరం వి సురేష్‌లు అన్నారు.

గురువారం మండలం లో ని మర్రి గూడ గ్రామ సచివాలయం లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆదేశాల మేరకు వైస్సార్సీపీ నాయకులు కార్యకర్తలు పరిశీలించారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షులు మీసాల రామకృష్ణ, ఎవి సురేష్ లు మాట్లాడుతూ సమాజంలో మంచి సేవలు అందజేస్తున్న జగనన్న ను మనమంతా ఆశీర్వదించి మళ్ళీ మళ్ళీ సీఎం ను చేద్దామని వేడుకొన్నారు. జె జగన్ జై రెడ్డి శాంతమ్మ, రెడ్డి శాంతమ్మ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ ఇక్కడ కు వచ్చిన ప్రజలు హోరాహె త్తించారు. ఈ సందర్భంగా 356 మంది గిరి జన ప్రజలు కి ఉచిత వైద్యపరీక్షలు, వైద్యం, ఉచిత మందులు వైద్యులు అందించారు. అంగన్వాడీ కార్యకర్తలు పౌష్టికాహారం స్టాల్స్ ను పరి శీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బి శైలజ, ఎంపీటీసీ ఎస్ శ్రీదేవి, సర్పంచ్ ఎస్ నందిని, సెక్రటరీ లు ఎస్ సరలా, బి మంగమ్మ, కన్వీనర్ లు మాసయ్య, గోపాలం, సైలాస్, ఎస్ మహేశ్వరీ,, రాజేష్, ప్రసాద్, కే బుడ్డయ్య, లూకలాపు వర ప్రసాద్ రావు, పుల్ల రమణ, పొట్నూరు సింహాచలం, వైద్యులు సి హెచ్ సాయి గీత, ఎం యశ్వంత్, జెమ్స్ వైద్యులు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

380 మందికి వైద్య పరీక్షలు

విశాలాంధ్ర-మెళియాపుట్టి: మెళియాపుట్టి మండలం పరశు రాంపురం సచివాలయం పరిధిలో గురువారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 380 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను సైతం పంపిణీ చేసినట్లు ఎంపీడీవో చంద్ర కుమారి తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో మొత్తం 380 మందితో పాటు పదిమంది విద్యార్థులు, అలాగే మరో 59 మందికి కంటి పరీక్షలుకి వైద్యపరీక్షలు నిర్వహించినట్లు తెలియజేస్తునే, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించి డాక్టర్ వై. చరిత, డాక్టర్ మనీషా, డాక్టర్ ఎం శివకుమార్, డాక్టర్ హేమంతులక్ష్మి, డాక్టర్ సందీప్, డాక్టర్ వాసుదేవరావుల బృందం వైద్య సేవలు అందించారన్నారు. ఎంపీడీవోతో పాటు ఎంపీపీ ప్రతినిధి ఈశ్వరమ్మ ఉదయ్ కుమార్, సర్పంచులు ప్రసాద్, ఈశ్వరరావు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, కార్యదర్శి శివాజీ, సచివాలయం సిబ్బంది, గ్రామస్తులు తదితరులున్నారు.